క్లుప్తంగా

పోలీస్‌స్టేషన్ తనిఖీ

పెద్దముడియం : స్థానిక పోలీస్‌స్టేషన్‌ను జమ్మలమడుగు డీఎస్పీ కె.వెంకటేశ్వరరావు బుధవారం ఆకస్మిక తనిఖీ చేసి రికార్డుల నిర్వహణను పరీక్షించారు. ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని తెలిపారు. స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రజల రక్షణే ధ్యేయంగా పోలీసులు విధి నిర్వహణలో ముందుడాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ సుబ్బారావు పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తులకు భిక్ష ఏర్పాటు



అయ్యప్ప భక్తులకు భోజనం వడ్డిస్తున్న సుబ్బారెడ్డి, తదితరులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని మిట్టమల్లేశ్వరస్వామి ఆలయంలోని అయ్యప్ప భక్తులకు బుధవారం తొండూరు మండలం తేలూరు గ్రామానికి చెందిన బీవీఎస్‌ఆర్ ట్రాన్స్‌పోర్ట్ అధినేత బి.వి.సుబ్బారెడ్డి అయ్యప్ప భక్తులకు భిక్ష ఏర్పాటు చేశారు.

గండికోట టోల్ గేట్ వసూలు రద్దు చేయాలి

జమ్మలమడుగు : గండికోటలో వసూలు చేస్తున్న అక్రమ టోల్‌గేట్ వసూలు రద్దుచేయాలని డీవైఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలోని ఆర్డీఓ సాయిశ్రీకి వినతి పత్రం అందజేసి వారు మాట్లాడారు. పర్యాటక కేంద్రమైన గండికోటలో ఎటువంటి వసతులు, సౌకర్యాలు కల్పించకుండానే టోల్‌గేట్‌లను వసూలు చేస్తున్నారన్నారు. ప్రతి శని, ఆదివారాల్లో పర్యాటకులు వేల సంఖ్యలో వస్తున్నారు. ఆర్కియాలజి అధికారుల అనుమతులు లేకుండానే టూరిజం శాఖ అధికారులు అక్రమంగా టోల్‌గేట్ వసూలు చేస్తున్నారన్నారు. వెంటనే చర్యలను చేపట్టాలని ఆర్డీఓకు వివరించారు. కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ జిల్లా కమిటీ సభ్యుడు ప్రసాద్ పాల్గొన్నారు.

మూడు రోజులు విధుల బహిష్కరణ



మాట్లాడుతున్న న్యాయవాదులు

జమ్మలమడుగు : కర్నూల్‌లో ఉన్న లోకాయుక్త కోర్టు, హ్యూమన్ రైట్స్‌కమీషన్ కార్యాలయాలను అమరావతికి తరలించడం సరైంది కాదని న్యాయవాదుల తెలిపారు. బుధవారం స్థానిక జూనియర్ సివిల్ కోర్టు న్యాయవాదులు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి మూడు రోజుల పాటు విధులను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు.

హాస్టల్ వార్డన్‌పై చర్యలు తీసుకోవాలి



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘనేతలు

జమ్మలమడుగు : ముద్దనూరు బీసీ హాస్టల్ వార్డన్ మనోహర్‌పై చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ సాయిశ్రీకి బుధవారం రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జగన్, కార్యదర్శి లింగమయ్యలు వినతిపత్రం అందజేశారు. ముద్దనూరు బాలురవసతి గృహంలో 82 మంది విద్యార్థులుండగా అందులో ప్రతిరోజు కేవలం 20 మంది విద్యార్థులు మాత్రమే హాజరవుతున్నారు. కాని 82 మంది విద్యార్థులకు భోజనం పెడుతున్నట్లు రాసుకుంటున్నారన్నారు. ఉన్నతాధికారులు విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

నేత్రదానం



లక్ష్మీదేవి కుటుంబ సభ్యులనుంచి కార్నియాలను సేకరిస్తున్న రాజు

పులివెందుల రూరల్ : మండలంలోని నల్లపురెడ్డిపల్లె గ్రామానికి చెందిన గుత్తి లక్ష్మీదేవి మృతి చెందటంతో ఆమె భర్త జోగయ్య నేత్రదానానికి అంగీకరిస్తూ నేత్ర సేకరణ కేంద్రానికి సమాచారం ఇచ్చారు. దీంతో వారు మృతురాలి ఇంటికి వెళ్లి కార్నియాలను సేకరించి డాక్టర్ అగర్వాల్ నేత్రాలయానికి పంపించారు. ఈ సందర్భంగా నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ బంధువులు లేదా సన్నిహితులు మరణించిన అనంతరం కుటుంబ సభ్యులు నేత్ర దానానికి అంగీకరించి 9966509364, 7093204537 ఫోన్ నెంబర్లకు సమాచారమివ్వాలన్నారు.

మూలన పడ్డ పారిశుద్ధ్య వాహనాలు



మరమ్మతులకు నోచుకోక మూలన పడ్డ ఎలక్ట్రానిక్ పారిశుద్ధ్య ఆటోలు

ఎర్రగుంట్ల : మున్సిపల్ పారిశుద్ధ్య వాహనాలు గత కొన్ని నెలలుగా మరమ్మతులకు నోచుకోక మూలన పడ్డాయి. క్లీన్ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా ఎర్రగుంట్ల మున్సిపాలిటీకి 9 ఎలక్ట్రానిక్ వాహనలు మంజూరయ్యాయి. అలాగే 4 డీజిల్ ఆటోలు ఉన్నాయి. 9 ఎలక్ట్రానిక్ పారిశుద్ధ్య ఆటోలలో కేవలం 2 మాత్రమే పనిచేస్తుండుగా 7 ఆటోలు మరమ్మతులకు నోచుకోక పాత మున్సిపల్ కార్యాలయంలో మూలన పడ్డాయి. అలాగే 4 డీజిల్ పారిశుద్ధ్య ఆటోలలో కేవలం 2 మాత్రం నడుస్తుండుగా మరో 2 ఆటోలు మూలన పడి తుప్పు పట్టాయి. ఆటోలు మూలన పడటంతో తడిపొడి చెత్త సేకరణ, ఇంటింటి కసువు సేకరణ అరకొరగా నడుస్తుంది. సుమారు 40 మంది పారిశుద్ధ్య కార్మికులు ఉన్నారు. వీరందరు ఉదయాన్నే నాలుగు రోడ్ల కూడలిలో మాత్రమే కసువు ఊడుస్తుంటారు. మిగిలిన సమయాలలో 20 వార్డులలో అక్కడక్కడ చెత్తసేకరణ చేపడుతుంటారు. ఆటోలు మరమ్మతులకు నోచుకోక పోవడంతో ఇంటింటి చెత్త సేకరణ 20 పుష్ కార్టులతో కార్మికులు వార్డులలో తిరుగుతు చేస్తున్నారు. ఇప్పటికైన మూలన పడ్డ వాహనాలకు మరమ్మతులు చేపడితే ఇంటింటి చెత్త సేకరణ చాలా సులువుగా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ శేషఫణిని వివరణ కోరగా త్వరలోనే పారిశుద్ధ్య వాహనాలను మరమ్మతులు చేయించి అందుబాటులోకి తెస్తామన్నారు. డిజటల్ ఆటోలో రెండు పూర్తిగా దెబ్బతిన్నాయని తెలిపారు. పారిశుద్ధ్యం ఎక్కడ లోపించకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.





మూలన పడ్డ డీజల్ పారిశుద్ధ్య ఆటోలు , ట్రాక్టర్ ట్రాలీలు

రేపు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. చర్మవ్యాధుల ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే ఆసుపత్రిలో 24 గంటలు ఎండోస్కోపీ, కోలనోస్కోపీ పరీక్షలతోపాటు గ్యాస్ట్రబుల్ తీవ్రత తెలుసుకోవడం, చిన్నపిల్లలు నాణేలు, పిన్నులు, సూదులు, ముక్కలు మింగితే తీయడం జరుగుతుందని.. ఎసోఫజిల్ వెరిసెస్‌కు ఎండోస్కోనిక్ బాండిన చేస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

24న చిత్రావతి చిత్రలేఖన పోటీలు

- కడప బాలోత్సవ కమిటీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోపాల్, లక్ష్మిరాజా

కడప ఎడ్యుకేషన్ : విద్యార్థులలో దాగిన సృజనాత్మకత వెలికితీయడానికి, చిత్రలేఖనంపై వారి ఆసక్తి పెంపొందించడానికి ఈ నెల 24న పులివెందులలో చిత్రావతి చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నట్లు కడప బాలోత్సవ కమిటీ అధ్యక్షుడు గుర్రాల గోపాల్, కార్యదర్శి లక్ష్మిరాజా తెలిపారు. కడప యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ చిత్రావతి చిత్రలేఖన పోటీలను పులివెందుల గాంధీ సర్కిల్‌లోని అహోబిలాపురం గవర్నమెంట్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొన వచ్చునని తెలిపారు. 6, 7వ తరగతి విద్యార్థులకు మా కుటుంబం అంశంపై, 8,9, 10వ తరగతుల వారికి పర్యావరణ పరిరక్షణ అంశంపై పోటీలు ఉంటాయని తెలిపారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు బహుమతులతోపాటు, కన్సొలేషన్ బహుమతి ఇస్తామన్నారు. పాల్గొన్న ప్రతి ఒక్కరికి సర్టిఫికెట్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. పేర్ల నమోదుకు కృష్ణారెడ్డి(9573506118), శ్రీనివాసులు(9491367785), వెంకటేశ్వరరెడ్డి (7675063933)లను సంప్రదించాలని తెలిపారు.



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు గోపాల్

ఫసల్ బీమా కొరకు దరఖాస్తు చేసుకోవాలి

వీరపునాయునిపల్లె : పంటలు సాగు చేసిన రైతులు ఫసల్ బీమా కొరకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీమాకు సంబంధించిన వివరాలను తెలియజేశారు. బ్యాంకులో రుణాలు పొందిన రైతులు లోన్ రెన్యువల్ చేసుకుని బ్యాంకుల ద్వారా బీమా ప్రీమియం చెల్లించవచ్చునన్నారు. ప్రీమియం చెల్లించడానికి 1బి, భూమి పాసుబుక్, బ్యాంకు అకౌంటు బుక్, మొబైల్ నెంబర్, పంట సాగు చేసిన ధృవీకరణ పత్రం, కౌలు రైతులు అయితే తహసీల్దార్ ద్వారా పొందిన కౌలు కార్డు తప్పని సరన్నారు. ఎకరా బుడ్డ శనగకు రూ.480, మినుము రూ.285, పెసర రూ.270, నువ్వులు రూ.180, వేరు శనగ రూ.480, జొన్న రూ.315, ప్రొద్దుతిరుగుడు రూ.300, వరికి రూ.630 చెల్లించాల్సి ఉంటుందన్నారు. వరి పంటకు డిసెంబర్ 30వ తేదీ, మిగిలిన పంటలకు డిసెంబర్ 15 తేదీ చివరి తేదీ అన్నారు. ఈ విషయాన్ని రైతులు గమనించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రీమియం చెల్లించిన రైతులందరూ అర్హులు కాదని సాగు చేసిన పంటను వ్యవసాయ సిబ్బందితో పంట నమోదు చేయించుకుని ఉండాలని లేకపోతే అనర్హులని తెలిపారు. పంట నమోదు చేయించుకున్న రైతులు మాత్రమే ప్రీమియం చెల్లించాలని తెలియజేశారు. ఫసల్ బీమాకు సంబంధించిన విధి విధానాలను రైతులకు తెలియజేయడంతో పాటు వారికి అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు.

పన్నులను వందశాతం వసూలు చేయాలి

పులివెందుల టౌన్ : మున్సిపాలిటీకి రావాల్సిన ఆస్తి పన్ను, నీటి పన్ను, ఖాళీ, జాగాల పన్ను, ఇతర అన్ని రకాల పన్నులను వందశాతం అమలు చేయాలని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ తెలిపారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని వీసీ హాలులో మున్సిపల్ కమిషనర్ రాముడు ఆధ్వర్యంలో వార్డు సచివాలయ అడ్మిన్, వెల్ఫేర్, అమీనిటీ, శానిటేషన్ సెక్రటరీలకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ పట్టణంలో ఉన్న అక్రమ కొళాయిలను గుర్తించి ఈ నెలాఖరు లోపు రెగ్యులర్ చేయించాలన్నారు. లేని యెడల అక్రమ కొళాయిలను తొలగించడమే కాకుండా వారి నుండి అపరాధ రుసుం వసూలు చేయాలన్నారు. అలాగే శానిటేషన్ సిబ్బంది పట్టణ పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. విధులలో సిబ్బంద నిర్లక్ష్యం వహిస్తే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ హాఫీజ్, హౌసింగ్ డీఈ రమణారెడ్డి, రెవెన్యూ అధికారి మునికుమార్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్

పర్యావరణాన్ని రక్షించుకుందాం

వీరపునాయునిపల్లె : సాగుకు పనికిరాని భూముల్లో మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఉమ్మడి భూమి అభివృద్ధి సమితి జిల్లా అధ్యక్షుడు ఐవీ రమణ తెలిపారు. బుధవారం ఉపాధి హామీ కార్యాలయంలో ఉమ్మడి భూమి అభివృద్ధి సమితి మండలస్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సాగుకు పనికిరాని భూములు ఎక్కడ ఉన్నా వాటిలో అంతరించి పోతున్న వృక్ష జాతుల పెంపకం చేపట్టాలని సూచించారు. కొండలు, గుట్టలు, వాగులు, చెరువుల వద్ద పెంచాలన్నారు. అలా చేయడం వలన వాతావరణ కాలుష్యాన్ని నివారించేందుకు వీలుంటుందన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలన్నారు. ప్రజల సహకారంతో ఇటువంటి కార్యక్రమాలు చేపట్టవచ్చునన్నారు. జిల్లా కోఆర్డినేటర్ రామకృష్ణ మాట్లాడుతూ సాగుకు పనికిరాని భూములు ఎక్కడెక్కడ ఉన్నాయో గుర్తించాలన్నారు. అక్కడ ఏ మొక్కలు బాగా పెరుగుతాయో వాటిని నాటేందుకు శ్రీకారం చుట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంజీఎన్‌ఆర్ ఈజీఎస్ ఈసీ పవన్, టెక్నికల్ అసిస్టెంటు సునీల్, ప్లాంటేషన్ సూపర్‌వైజర్ సుబ్బారెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో అధిక లాభాలు



కమలాపురంలో పంటలను పరిశీలిస్తున్న ఏఓ సరస్వతి



కొండాపురంలో శనగపంటను పరిశీలిస్తున్న ఏఓ రామాంజులరెడ్డి

కమలాపురం : ప్రస్తుతం సాగులో ఉన్న పంటలకు సస్యరక్షణ చర్యలు చేపట్టి అధిక దిగుబడులు సాధించాలని మండల ఏఓ సరస్వతి తెలిపారు. బుధవారం మండలంలోని జంభాపురం, గొల్లపల్లి గ్రామాలలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మినుము, ఉలవ పంటలను పరిశీలించారు. ఆకుముడత, పల్లాకు తెగులు, మొవ్వకుళ్లు వైరస్, రసం పీల్చే పురుగు ఆశించాయన్నారు. రసం పీల్చే పురుగు నివారణకు పసుపు, నీలి రంగు పల్లాలు ఏకరాకు 15 చొప్పున అమర్చు కోవాలన్నారు. తామర పురుగు, పేను బంక, తెల్లదోమ నివారణకు ఇమిడా క్లోప్రిడ్ 0.4 మి.లీ. లేదా డైఫెన్ద యూరాన్ 1.25 గ్రాము లేదా అసిటమాప్రిడ్ 0.2 గ్రాం తో పాటు 13.0.45 10 గ్రాముల నీటికి కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. బూడిద తెగులు నివారణకు మైక్లో భుటానిల్ 1.5గ్రాం, లేదా 2 మి.లీ.హెక్సాకోనోజల్, లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ మహేష్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సోని, రైతులు పాల్గొన్నారు.



పులివెందులలో శనగ పంటను పరిశీలిస్తున్న ఏఓ

శనగ పంట పరిశీలన

కొండాపురం : మండలంలోని ఏటూరు గ్రామంలో బుధవారం నిర్వహించిన పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాయ అధికారి ఏవీ రామాంజులరెడ్డి శనగ పంటను పరిశీలించి మాట్లాడారు. శనగ పొలంలో వేరుకుళ్ల తెగులు సోకిందని దాని నివారణకు మందులను పిచికారి చేయాలన్నారు. పంట మార్పిడి పద్ధతులు పాటించడం వల్ల చీడ పీడల ఉధృతిని తగ్గించవచ్చునన్నారు. శనగ పంటలో అక్కడక్కడ ఎర్రపంటగా బంతిపూలు వేసుకున్నట్లయితే పచ్చపురుగు ఉధృతిని అరికట్టవచ్చునన్నారు. కార్యక్రమంలో ఎంపీఈఓ పి.అశ్విని, రైతులు పాల్గొన్నారు.

అందుబాటులో సబ్సిడీ వేరుశనగ విత్తనాలు

పులివెందుల రూరల్ : రబీ సీజన్‌లో వేరుశనగ పంట సాగు చేసే రైతులకు సబ్సిడీ వేరుశనగ విత్తన కాయలు అందుబాటులో ఉన్నాయని ఏఓ నాగలక్ష్మి తెలిపారు. బుధవారం మండలంలోని అచ్చివెళ్లి, రాగిమానుపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఏఓ హాజరై శనగ పంటలో మొక్కలు చనిపోవడాన్ని గుర్తించారు. దీని నివారణకు టేబుకోనజోల్ 1 ఎంఎల్ లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. సబ్సిడీ వేరుశనగ విత్తన కాయలు కావాల్సిన రైతులు తమ పాసు పుస్తకం, ఆధార్ కార్డు తీసుకుని రైతు సేవా కేంద్రంలో కానీ, మండల వ్యవసాయ కార్యాలయంలో కానీ సంప్రదించాలన్నారు. అలాగే రాగిమానుపల్లెలో మొక్కజొన్న పంటను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది భాస్కర్‌రెడ్డి, సుభాన్, ఐసీఆర్పీ శివ పార్వతి, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రామోత్సవం

సింహాద్రిపురం : స్థానిక శ్రీమణికంఠేశ్వరస్వామి దేవస్థాన 4వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం అయ్యప్పస్వామి గ్రామోత్సవం నిర్వహించారు. వార్షికోత్సవం సందర్భంగా అయ్యప్పస్వామిని ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

వైవీయూ: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యత అని యోగి వేమన విశ్వవిద్యాలయం పీజీ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి తెలిపారు. వైవీయూ క్యాంపస్‌లో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-9 ఆధ్వర్యంలో కంప్యూటర్ సైన్స్ విభాగం విద్యార్థులు బుధవారం శ్రమదానం చేశారు.

'పుష్కల్' ఔట్‌లెట్ ప్రారంభం

పులివెందుల రూరల్ : అంబకపల్లె రోడ్డులోని ఏపీజీబీ ఎదురుగా శివశక్తి గ్రూప్ ఆఫ్ కంపెనీలలో ఒకటైన పుష్కల్ ఆగ్రోటెక్ రీటైల్ ఔట్‌లెట్ లిమిటెడ్‌ను బుధవారం ఆ సంస్థ చైర్మన్ శ్రీనివాసరావు ప్రారంభించి మాట్లాడారు. నాణ్యమైన పుష్కల్ ఆగ్రోటెక్ కంపెనీ సేంద్రీయ, జీవన ఎరువులు, ఆగ్రో కెమికల్స్ లాంటి ఉత్పత్తులను రైతులకు అందిస్తూ, రైతుల పురోగతికి కృషి చేస్తూ రైతుల మన్ననలను పొందుతోందన్నారు. పరిసర గ్రామాల్లో హార్టికల్చర్, అగ్రికల్చర్ బాగా అభివృద్ధి చెందిందని.. మా సంస్థ కూడా నూతన టెక్నాలజీ, నాణ్యమైన నూతన వ్యవసాయం ఉత్పత్తులను రైతులకు అందిస్తామన్నారు. కార్యక్రమంలో శివశక్తి గ్రూప్ ఆఫ్ కంపెనీ ఎండీ హరీష్‌బాబు, సీఈఓ కె.నరసింహరావు, వైస్ ప్రెసిడెంట్ శర్మ, జీఎం శివసాగర్ బాబు, ఆర్‌ఎం రాజశేఖర్, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న చైర్మన్ శ్రీనివాసరావు

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

కమలాపురం : ఈనెల 14వ తేదీ నుంచి కమలాపురం శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి బి నాగాంజలి ఆధ్వర్యంలో జరుగుతున్న 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు బుధవారం ముగిసాయి. చివరి రోజు స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు అతిథులు బహుమతులు ప్రదానం చేశారు. వారోత్సవాలు జరిగిన వారం రోజుల పాటు వివిధ పాఠశాలల విద్యార్థులకు ఆటలు, వ్యాస రచన, వక్తృత్వపు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. గ్రంథాలయాలను ప్రతి ఒక్కరు వినియోగించు కోవాలన్నారు. ప్రతి ఏటా గ్రంథాలయ శాఖ వారు విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీయ డానికి చిత్రలేఖనం, వ్యాసరచన, ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల నుంచి వచ్చిన ఉపాధ్యాయులు, గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నెలో..

వల్లూరు (చింతకొమ్మదిన్నె) : స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు బుధవారం లైబ్రేరియన్ ఇబ్రహీం ఆధ్వర్యంలో ముగిశాయి. వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 రమాదేవి మాట్లాడుతూ అయ్యంకి వెంకటరమణయ్య కృషి వల్ల నేడు మనకు గ్రంథాలయాలు స్థాపించబడ్డాయన్నారు. ఈఓఆర్డీ వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ గ్రంథాలయ ఉపయోగాలను వివరించి అలాగే మండల పరిధిలోని అన్ని పంచాయతీల నుండి బకాయిలు వసూలు చేసి గ్రంథాలయ సెస్సును త్వరలోనే అందజేస్తామన్నారు. రాఘవేంద్ర, షాకీర్ హు స్సేన్, ఏపీవో రామానుజులరెడ్డి, అధికారులు, ద్యా ర్థులు పాల్గొన్నారు.



కమలాపురం : విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు

పులివెందులలో..

పులివెందుల టౌన్ : పట్టణంలోని రవీంద్రనాథ హైస్కూలు, రమణప్ప సత్రంబడి పాఠశాలల విద్యార్థులకు బుధవారం హెడ్మాస్టర్లు చిట్టిబాబు, విశ్వనాథరెడ్డిలు బహుమతులను ప్రదానం చేశారు. గ్రంథాలయ ముగింపు వారోత్సవాల సందర్భంగా వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను పంపిణీ చేశారు. గ్రంథాలయ అధికారి కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముద్దనూరులో..

ముద్దనూరు : 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం విద్యార్థులకు పలురకాల పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈవో-2 నాగేశ్వరరావు నాయక్ విద్యార్థులకు బహుమతులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి శేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వేముల : విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేస్తున్న గ్రంథాలయ అధికారి గంగాధర్ యాదవ్

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి శేఖర్ ఆధ్వర్యంలో బుధవారం గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా ముగిశాయి. ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెడ్మాస్టర్ ప్రతాప్‌రెడ్డి హాజరై ఉపన్యాస, వ్యాసరచన, చిత్రలేఖన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కోవరంగుంటపల్లె శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారిణి గంగాదేవి వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లింగాలలో..

లింగాల : నైతిక విలువలతో కూడిన జీవనాన్ని అలవరుచుకోవాలని పాఠశాల హెడ్మాస్టర్ పద్మావతమ్మ తెలిపారు. బుధవారం స్థానిక గ్రంథాలయంలో లైబ్రేరియన్ జయమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గ్రంథ పఠనం చాలా మంచి అలవాటని, చిన్న వయస్సు నుంచే పుస్తకాలు చదవడం అలవరుచుకోవాలన్నారు. అనంతరం వ్యాసరచన, ఉపన్యాస, చిత్రలేఖన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఉపాధ్యాయులు రఘునాథరెడ్డి, పద్మావతి, విద్యార్థులు పాల్గొన్నారు.



జమ్మలమడుగు : ఉపాధ్యాయులకు సన్మానం చేస్తున్న గ్రంథాలయాధికారులు

వేములలో..

వేముల : స్థానిక గ్రంథాలయంలో బుధవారం గ్రంథాలయ అధికారి గంగాధర్ యాదవ్ ఆధ్వర్యంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా లైబ్రేరియన్ గంగాధర యాదవ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చిన్నతనం నుండే గ్రంథాలయానికి వెళ్లడం అలవాటు చేసుకోవాలని పుస్తకాలు చదవడం వలన మంచి నడవడిక, మంచి అలవాట్లు వస్తాయన్నారు. అనంతరం ఉపన్యాస, వ్యాసరచన, చిత్రలేఖన, పెయింటింగ్, డ్రాయింగ్ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

చక్రాయపేటలో..

చక్రాయపేట : స్థానిక గ్రంథాలయంలో బుధవారం గ్రంథాలయ వారోత్సవాలు ముగిసినట్ల గ్రంథాలయాధికారి రాజశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ కృష్ణయ్య, ప్రధానోపాధ్యాయులు రామాంజులు, కస్తూర్బా గాంధీ పాఠశాల ప్రిన్సిపాల్ గౌస్‌ప్యారీలు పాల్గొని వివిధ పోటీల్లో పాల్గొన్న విజేతలకు బహుమతులను పంపిణీ చేశారు.

వేంపల్లెలో..

వేంపల్లె : స్థానిక గ్రంథాలయంలో, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోనూ ఆయా పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి వనజకుమారి, డిగ్రీ కళాశాల గ్రంథాలయ అధికారి మాధవరావులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుంటే విజ్ఞానాన్ని పెంచుకోవచ్చునన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యోగాంజనేయులు, పీడీ తేజేంద్ర, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : పట్టణంలోని ప్రభుత్వ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన చిత్రలేఖనం, వ్యాసరచన, ఖోఖో వంటి పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేసినట్లు గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ ఉమాదేవి తెలిపారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : విద్యార్థులు పుస్తకాలు చదవడం వల్ల మానసిక వికాసం పెరుగుతుందని గడియారం సాహితీ పీఠం అధ్యక్షుడు డాక్టర్ ఎంఎల్ నారాయణ రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక గ్రంథాలయంలో నిర్వహించిన వార్షికోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పుస్తకాలు చదవడం వల్ల ఎంతో మంది వక్తలుగా మారి సమాజానికి సేవ చేశారన్నారు. అనంతరం వివిధ పోటీలలో పాల్గొన్న విద్యార్థులకు ఆయన బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి జింకా చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.